సమృద్ధిగా నీరు.. వరి సాగు జోరు

- ఇల్లంతకుంట మండలంలో 25 వేలకు పైగా ఎకరాల్లో పంట
- గతేడాది ఇది 20 వేల ఎకరాలే
- పూర్తి కావొస్తున్న నాట్లు
- చీడపీడల బెడద, వడగండ్లు లేకుంటే రైతన్నల పంట పండినట్లే



రహీంఖాన్‌పేటలో సాగు చేసిన వరి

ఇల్లంతకుంట: మూడేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వానాకాలం, యాసంగి సీజన్లలో వరిసాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఐదారేళ్ల క్రితం వరకు యాసంగి వచ్చిందటే ఎక్కడ చూసినా ఇల్లంతకుంట మండలంలో నెర్రెలుబారిన నేలలు కనిపించేవి. కానీ వరుణుడు కరుణించడంతో ప్రస్తుతం రెండు పంటలకు ఢోకా లేకుండా పోయింది. గతేడాది వానాకాలంలో కురిసిన వర్షాలతో మండలంలోని 96 చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. దీనికితోడు మధ్యమానేరు, అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్లు ఉండటంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి.

మండలంలో 33 గ్రామాలు..

ఇల్లంతకుంట మండలంలోని 33 గ్రామాల్లో ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 25 వేల ఎకరాల వరకు వరినాట్లు పూర్తి కావొచ్చాయి. గత వానాకాలం సీజన్‌లో చీడపీడల బెడద కారణంగా రైతులు నష్టాలు చవిచూశారు. ఈ సీజన్‌లోనైనా పంట సమృద్ధిగా పండుతుందని ఆశిస్తున్నారు. వరితోపాటు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో మరో 500 ఎకరాల్లో వరి నాట్లు వేస్తారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

కాండం తొలుచు పురుగు ఉధృతి..

ఈ యాసంగి సీజన్‌లో వరినాట్లు వేసిన రైతులు ఇప్పటికే కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి పైరులో కాండం తొలుచు పురుగు ఉధృతి కారణంగా పురుగు మందులు స్ప్రే చేస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే పురుగు ఉధృతి తగ్గుముఖం పడుతోందని అంటున్నారు. ఇక మార్చి, ఏప్రిల్ మాసాల్లో వడగండ్ల వర్షాలు రాకుండా ఉంటే తమ పంట పండినట్లేనని చెబుతున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



ఇల్లంతకుంట మండలంలో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. అక్కడక్కడ అడపాదడపా నాట్లు వేస్తున్నారు. వరిలో ఇప్పటికే కాండం తొలుచు పురుగు కనిపిస్తోంది. రైతులు పొలాన్ని ఆరబెట్టి, 19-19-19 మందు స్ప్రే చేయాలి. పంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడి బాగానే వస్తుంది.

– సందీప్, మండల వ్యవసాయాధికారి, ఇల్లంతకుంట

చీడపీడల బెడద లేకుంటే చేతికి..



మేడు గత డిసెంబర్ మొదటి వారంలోనే వరి నాట్లు వేశాం. కానీ కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఉండటంతో పంటకు కొంతమేర నష్టం జరిగింది. 15 రోజులుగా పురుగు ఉధృతి తగ్గుముఖం పట్టింది. చీడపీడల బెడద, వడగండ్ల వర్షం లేకుంటే పంట చేతికందుతుంది.

– ఏనుగుల మధు, రైతు, రహీంఖాన్‌పేట

అనంతగిరి నీళ్లు ఇవ్వాలి



ప్రస్తుతం పదెకరాల్లో వరి సాగు చేశాను. పంటకు ఇప్పటివరకు ఎలాంటి చీడపీడలు లేవు. కానీ బావిలో నీళ్లు ఇప్పుడే అడుగంటిపోతున్నాయి. అనంతగిరి రిజర్వాయర్ నుంచి రహీంఖాన్‌పేట సింగరాయ చెరువులోకి నీళ్లు విడుదల చేయాలి. లేకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

– బత్తిని స్వామి, రైతు, రహీంఖాన్‌పేట

క్లుప్తంగా

ఘనంగా చౌడాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పట్నం వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

ముస్తాబాద్: మండలంలోని మొర్రాయిపల్లెలో చౌడాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని యాదవ, కురుమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పట్నాలు, ఒగ్గు కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ సడిమెల సుజాత, జెడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సంఘాల అధ్యక్షులు నాగరాజు, కరుమ రాజం, నాయకులు జెల్ల వెంకటస్వామి, కుడుకల మల్లేశం, సాయిలు, పర్వతాలు, కుమార్, సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థులకు త్వరలో శిక్షణ తరగతులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కేటీఆర్ కోచింగ్ సెంటర్ ద్వారా ప్రిలిమ్స్, ఈవెంట్స్‌లో ఉత్తీర్ణులైన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫ్యాకల్టీతో తరగతులుంటాయని అన్నారు. కోచింగ్‌కు వెళ్లలేని ఎంతోమంది అభ్యర్థులు ఉత్తమ శిక్షణ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ సూచన మేరకు వారికి శిక్షణ ఇప్పించేందుకు ఫ్యాకల్టీతో మాట్లాడినట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన శిక్షణతో 120 మంది ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులయ్యారని ఆయన పేర్కొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకోవడంతోపాటు రూ.15,950 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

‘ఆదర్శ’ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

ఇల్లంతకుంట: ఆదర్శ పాఠశాలల టీచర్లకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఇల్లంతకుంటలో సంఘం క్యాలెండర్‌ను విడుదల చేశారు. టీచర్లకు హెల్త్ కార్డులతోపాటు 010 పద్దు ద్వారా వేతనాలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.వెంకన్న, పి.వెంకన్న, రాజయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సెస్ డైరెక్టర్‌కు సన్మానం



మల్లేశంను సన్మానిస్తున్న బీసీ నాయకులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం బీసీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, నాయకులు సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంను సన్మానించారు. బీసీలందరూ ఐక్యంగా పోరాడి, హక్కులను సాధించుకోవాలన్నారు. త్యాగాలు బీసీలవి అయినప్పుడు రాజ్యాధికారం కూడా బీసీలదే కావాలని పేర్కొన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలు తీర్చాలని సెస్ డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయిన రవి, బీసీ నాయకులు లింగం, రాజ్‌కుమార్, దేవయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం



దగ్ధమైన వరి గడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో పాశం జంబారెడ్డికి చెందిన పశువుల పాక దగ్ధమైంది. పాకలోని పది ట్రాక్టర్ల వరి గడ్డి కాలిపోయి, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సర్పంచ్ సరోజన సంఘటన స్థలాన్ని పరిశీలించి, అధికారులకు సమాచారం అందించారు.

చికిత్స పొందుతూ పారిశుధ్య కార్మికురాలి మృతి

- గత నెల 31న ఆత్మహత్యాయత్నం



లావణ్య (ఫైల్)

ముస్తాబాద్: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు అరుగుల లావణ్య(35) గత డిసెంబర్ 31న ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు ఆమెను ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం మెరుగుపడక పోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. దాదాపు నెల రోజులపాటు మృత్యువుతో పోరాడిన లావణ్య ఆదివారం మృతిచెందింది. మృతురాలికి భర్త నర్సింలు, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుంతల పూడ్చివేత

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో బీటీరోడ్డు చివరలో పలుచోట్ల పడిన గుంతలు, కయ్యలను ఆదివారం మట్టితో పూడ్చినట్లు సర్పంచు అక్కెనపెల్లి జ్యోతి తెలిపారు. ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలు తీస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పోచమ్మ ఆలయాన్ని ఇటీవలే పునఃనిర్మించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సర్పంచు పోకల రేఖ తదితరులు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆలయం వద్ద బోరు, మోటారు మంజూరు చేయగా, సీఐ విజ్ఞాన్‌రావు రూ.25 వేలు విరాళంగా అందించారు.

శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగం ప్రారంభం



చందుర్తిలో...

చందుర్తి: మండలంలోని బండపల్లి, కిష్టంపేట గ్రామాల్లో గౌడ కులస్తుల ఆరాధ్య దైవంగా భావించే శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గౌడ కులస్తులు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కొండ లక్ష్మణ్‌గౌడ్, నాయకులు బుర్ర వెంకటి, బుర్ర రాజేశం, పల్లి మల్లేశం, కాసారపు రాములు, కాసారపు గంగాధర్‌గౌడ్, కాసారపు గౌతం, బైరగోని శ్రీనివాస్, కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న నిర్లక్ష్యం



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్లే దారిలో సెస్ కార్యాలయానికి దగ్గరలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. అవి విద్యుత్ వైర్లకు తగిలితే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. సెస్ అధికారులు వెంటనే స్పందించి, తీగజాతి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు:
రాకేశ్‌రెడ్డి, సెస్ ఏఈ, బోయినపల్లి
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్:
94408 14076

స్నేహితురాలి భర్త వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న మమత స్నేహితులు

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన మాందాల మమత భర్త సంతోష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు తమ స్నేహితురాలి కుటుంబం ఇబ్బందులు పడుతోందని మమతతో 2005–06లో పదోతరగతి చదివిన ఆమె స్నేహితులు, యువ చారిటబుల్ ట్రస్ట్ (నిమ్మపల్లి) సభ్యులు తెలుసుకున్నారు. మొత్తం రూ.50,200 విరాళాలను సేకరించారు. ఆదివారం ఆమెను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత, నాగండ్ల భూమేశ్ తదితరులు కోరారు.

రైతు సమస్యలపై చర్చించాలి



మాట్లాడుతున్న అంజయ్య

వీర్నపల్లి: వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలపై చర్చించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర సర్కారు ఒకేసారి రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నాయకులు రాజం, సంజీవ్, మల్లారపు రాజం తదితరులున్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు కల్పించండి



మాట్లాడుతున్న రంజిత్ కుమార్

వేములవాడఅర్బన్: ప్రభుత్వ హాస్టళ్లు, విద్యాలయాల్లో వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. వేములవాడలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు జైలుకన్నా హీనంగా ఉన్నాయని ఆరోపించారు. పట్టణంలోని పలు వసతి గృహాలను ఆదివారం పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. హాస్టళ్లలో లైట్లు, బెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, అభినవ్, సాగర్, మణిదీప్, బాలాజీ, శ్రీనాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలను అన్నివిధాలా ఆదుకుంటాం



నగదు అందిస్తున్న యాదవ సంఘం నాయకులు

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట: గొల్ల, కురుమలను అన్నివిధాలుగా ఆదుకుంటామని యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల భాస్కర్ యాదవ్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో ఇటీవల గొర్రెల మందపై కుక్కలు దాడి ఘటనలో 12 గొర్రెలు చనిపోయాయి. వీర్నపల్లి మండలంలోని మద్దిమల్లకు చెందిన బాధిత కుటుంబాలకు ఆదివారం రూ.21 వేల ఆర్థికసాయం అందించారు. సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు మెండె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పర్మాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్యాట్ల రవి, నాయకులు పిల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ వేడుకలకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో గిద్దె చెరువు మైసమ్మ, దుర్గమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బంగారు రథంపై దుర్గామాత విగ్రహాన్ని ఊరేగించనున్నామని, విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎవరూ చందాల రూపంలో డబ్బులు ఇవ్వొద్దని అన్నారు.

గోశాలలకు రాజన్న కోడెలు



కోడెలను అప్పగిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని వేములవాడ రాజన్న కోడెలను ఆదివారం జనగామ జిల్లాకు తరలించారు. పాలకుర్తి మండలంలోని కొండాపూర్ పోతన గోశాలకు 20, రామన్నపేట బృందావనం గోశాలకు 20 కోడెలను అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి కళారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నవీన్

సిరిసిల్లకల్చరల్: సృజనాత్మకతతో వ్యవసాయ రంగంలో ఉపకరించే పలు రకాల పరికరాలను రూపొందిస్తూ గుర్తింపు తెచ్చుకున్న జిల్లావాసి శ్రీరాముల నవీన్‌కుమార్‌ను మరో పురస్కారం వరించింది. హుస్నాబాద్‌లో యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేతాజీ, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో నవీన్ ప్రతిభను గుర్తించి, సత్కరించారు. ఆయనకు స్ఫూర్తి కళారత్న అవార్డు అందించారు. ఈ సందర్భంగా నవీన్‌ను సిరిసిల్ల సాహితీ సమితి, మానేరు రచయితల సంఘం ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, వెంగల లక్ష్మణ్, ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, వాసరవేణి పర్శరాం తదితరులు అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



తనిఖీలు చేస్తున్న ఎస్సై శేఖర్

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై శేఖర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి, రాగట్లపల్లి, వెంకటాపూర్‌లలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపవద్దన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి, బైక్‌లు నడుపుతూ పట్టుబడిన ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవోపేతం.. దుర్గాదేవి కల్యాణోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి 12వ వార్డు చంద్రంపేటలో దుర్గమ్మ బోనాలు, అమ్మవారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు, జేసీబీ

బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లి శివారులోని వరద కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఈ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

కోనరావుపేట: మండలంలోని ధర్మారం నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ధర్మారం–మల్కాపేట గ్రామాల మధ్య ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన మట్టిని గ్రామస్తులకు చెందిన పట్టా భూమిలో నుంచి ఆదివారం ట్రాక్టర్లలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. మట్టి తరలింపు కోసం ఎలాంటి అనుమతి లేదని గుర్తించారు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో ట్రాక్టర్లను తీసుకొని, వెళ్లిపోయాయి. తహసీల్దార్ నరేందర్ మాట్లాడుతూ.. పట్టా భూమిలో మట్టి తీసుకునే అవకాశం ఉందని, కానీ అధికారుల అనుమతి తీసుకొని తరలించాలని చెప్పారు.

పోలీస్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కోనరావుపేట: పోలీస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే పర్యటనలను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కోనరావుపేటలో ఆదివారం ఆయన మాట్లాడారు. గత నోటిఫికేషన్లతో పోలిస్తే ఈసారి ఈవెంట్స్‌లో మార్పులు చేయడం వల్ల చాలా మంది అభ్యర్థులు ఉద్యోగాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, వినోద్, శేఖర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.